పశుగ్రాసానికి డిమాండ్

- మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో 13 వేల హెక్టార్లలో వరి సాగు
- ఎకరా వరిగడ్డి ధర రూ.3 వేలు
- ఉమ్మడి ప్రకాశం, కర్నూలు జిల్లాలకు తరలింపు
- బేళ్లుగా చుట్టి రవాణా



వరి కట్టలను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

మహానంది: వరి కోతలు మొదలైతే చాలు పశుగ్రాసం కోసం పాడి రైతులు క్యూ కడుతున్నారు. ఒకప్పుడు వ్యవసాయ కూలీలు వరి కోతలు కోయడం, చేతులతో కట్టలు కట్టి తూర్పారబట్టాక ధాన్యం వేరు చేసే వారు. దీంతో పశుగ్రాసం పుష్కలంగా లభించేది. కాలక్రమేణా సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటం, సులువుగా వరి ధాన్యం, గడ్డి వేరు చేసి క్షణాల్లో పని పూర్తి చేసే యంత్రాలు వచ్చేశాయి. అయితే ఈ పద్ధతిలో గడ్డి ముక్కలై వృథా అవుతుండటంతో గ్రాసానికి కొరత ఏర్పడుతోంది. అప్పట్లో రైతులు పశుగ్రాసానికి డబ్బులు తీసుకోకుండానే పాడి రైతులకు తీసుకెళ్లమని చెప్పేవారు. కానీ నేడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. దీంతో పశుగ్రాసానికి విపరీతమైన డిమాండ్ నెలకొంది.

కోతల సమయంలోనే కొనుగోలు

మహానంది మండలంలో 3,007 హెక్టార్లలో, బండి ఆత్మకూరు మండలంలో 10వేల హెక్టార్లలో వరి సాగయ్యింది. ప్రస్తుతం కోతలు ముమ్మరంగా జరుతుండటంతో పంట పొలాల్లో వరి కోత మిషన్లు సందడి చేస్తుంటాయి. అందులో భాగంగా రెండు మండలాల్లో ఇప్పటికే 75 నుంచి 80 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. మిగిలిన పంట పొలాలు వరి కోతలకు సిద్ధంగా ఉన్నాయి. వరి కోతలు జరిగే సమయంలోనే ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల లోని డోను పత్తికొండ వెల్దుర్తితో పాటు రాయలసీమలోని అనంతపురం, ప్రకాశం జిల్లా గిద్దలూరు, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి పాడి రైతులు పశుగ్రాసం కోసం మహానంది, బండి ఆత్మకూరు మండలాల వైపు వస్తున్నారు. కోత సమయంలోనే కొనుగోలు చేస్తూ ట్రాక్టర్లు,లారీల ద్వారా తరలిస్తున్నారు.

ఎకరా గడ్డి రూ. 2,500 నుంచి రూ. 3వేలు

ఒక ఎకరాకు లభించే వరిగడ్డికి సుమారు రూ. 2,500 నుంచి రూ. 3 వేల వరకు వెచ్చించాల్సి వస్తుంది. టైర్ల మిషన్లతో కోసిన పొలాల్లో వరిగడ్డి నాణ్యంగా ఉండడంతో పాటు అధికంగా లభ్యం అవుతుంది. అదే చైన్ల మిషన్లతో అయితే గడ్డి కొంత పాడవడంతో పాటు లభ్యత తక్కువగా ఉంటుంది. గతంలో లాగా వరి వాముల తరహాలో తీసుకెళ్లడం కష్టతరంగా మారడంతో ప్రస్తుతం చక్రాల్లాగా బేళ్ల కడుతుండటంతో రవాణాకు సులువుగా మారింది. ఎక్కువ బేళ్లను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఒక్కో బేలులో సుమారు 20 నుంచి 30 కిలోల వరకు గడ్డి ఉంటుంది. దీని ధర రూ.70 నుంచి 90 వరకు మార్కెట్లో విక్రయిస్తున్నారు.



కట్టలు కట్టి సిద్ధంగా ఉంచిన వరిగడ్డి

ఇతర జిల్లాలకు ఎగుమతి



15 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశాను. ప్రస్తుతం పంట పొలాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో వరి సాగు అధిక విస్తీర్ణంలో ఉంది. దీంతో కోతల సమయంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాల నుంచి పాడి రైతులు పశుగ్రాసం కోసం రెండు మండలాల వైపు వస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో లభించే పశుగ్రాసానికి రూ. రెండు నుంచి రూ. మూడు వేల వరకు చెల్లిస్తున్నారు.

– అవుటాల నాగేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్, బండిఆత్మకూరు

మిషన్ల రాకతో కొరత



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న నేటి రోజుల్లో వరి కోతల కోసం రైతులు ఎక్కువగా మిషన్లను వినియోగిస్తున్నారు. వీటి ద్వారా వ్యవసాయ కూలీల ఖర్చు తగ్గడంతో పాటు కోతలు త్వరగా పూర్తవుతున్నాయి. ఇదిలా ఉండగా కొంత గడ్డి పాడవుతుండటంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది. దీంతో పశుగ్రాసానికి మంచి డిమాండ్ నెలకొంది. మహానంది మండలం నుంచి వివిధ ప్రాంతాలకు పశుగ్రాసం సరఫరా అవుతుంది. పాడి రైతులతో పాటు వివిధ ప్రాంతాల్లోని గోశాలల నిర్వాహకులు ఇక్కడి నుంచి పశుగ్రాసాన్ని తీసుకెళ్తున్నారు.

– నాగేశ్వర రెడ్డి, ఏఓ, మహానంది

క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. స్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పేదలకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం చేస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆత్మకూరు పట్టణానికి చెందిన నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు శిల్పా కార్తీక్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మానవతాదృక్పథంతో పేదలకు ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. ముర్తుజావలికి రూ.5 వేలు, కృష్ణానాయక్ రూ.5 వేల చొప్పున నగదు అందించారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొమిన్ మునీర్ బాషు, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



మల్యాలలో పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

నందికొట్కూరు రూరల్: మండలంలోని రైతులు రబీసీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ షేక్షావలి సూచించారు. మంగళవారం మల్యాల గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలో తెగుళ్ల నివారణకు రైతు భరోసా కేంద్రంలోని కిసాన్ సెంటర్‌కు రైతులు ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ట్యాబ్‌ల మంజూరు



పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం, పాత ముచ్చుమర్రి, పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 164 ట్యాబ్‌లు మంజూరైనట్లు విద్యాధికారి సుభాన్ తెలిపారు. మంగళవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆయా పాఠశాలల సిబ్బందికి వాటిని అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబ్‌లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 21వ తేదిన జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తామని చెప్పారు.

త్వరలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు



ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: జనవరిలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్ రెడ్డి తెలిపారు. క్రీడలకు సంబంధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదాన్ని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే క్రీడాపోటీల వివరాలు ప్రకటిస్తామని, భారీ స్థాయిలో టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పువ్వాడ భాస్కర్, విజయచౌదరి, సుల్తాన్, రఫీక్, పీఈటీలు రఫీక్, దేవానందం పాల్గొన్నారు.

కొనసాగుతున్న తిరుప్పావై ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సంజీవనగర్ రామాలయంలో మంగళవారం టీటీడీ దివ్యప్రబంధ ప్రాజెక్టు నంది రైతు సమాఖ్య, శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచనాలు మూడో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవ వ్యాఖ్యత డాక్టర్ టీవీ హయ గ్రీవాచార్యులు గోదాదేవి మూడవ రోజు నిర్వహించే వ్రత పాశురాన్ని వివరించారు. శ్రీ మహావిష్ణువు వామనుడిగా జన్మించి బలిచక్రవర్తి అహంకారాన్ని అనిచివేసే విధానాన్ని గోపికలకు వివరిస్తున్న సన్నివేషాన్ని వివరించారు.

ఎర్రమఠంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు విజయరామరాజు, నరసింహ, ఓబులేసు, సత్యరాజు, శేషన్న, జయన్న మంగళవారం తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా సీఎస్ఐ సంఘం, సంఘపెద్దల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 26 నుంచి ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 25వ తేదీలోపు ప్రవేశరుసుము రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు వరుసగా రూ.12వేలు,రూ.8వేలు,రూ.6వేలు, రూ.4వేలు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు సెల్ 9346899651, 9959091565, 7893064366 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రణాళికా బద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు

పగిడ్యాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికా బద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని హెచ్ఎం మధుసూదన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను ఏకాగ్రతతో చదువుకోవాలన్నారు. అర్థంకాని అంశాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌ల ద్వారా పదే పదే ఆ అంశాన్ని వినాలన్నారు. బట్టీకొట్టే విధానానికి స్వస్తి పలికి టెస్ట్ పుస్తకాలను బాగా చదివితే ప్రశ్నలకు కావాల్సిన జవాబులను సులభంగా రాస్తారని వివరించారు.

మరో పది రోజులు వన్ ఆర్ తూము నుంచి నీటి సరఫరా



ఎమ్మెల్యే శిల్పాకు సమస్యను విన్నవిస్తున్న గుంతకందాల రైతులు

వెలుగోడు: రైతులు సాగు చేసిన పంటలను దృష్టిలో పెట్టుకొని వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని వన్ ఆర్ తూము నుంచి గుంతకందాల పొలాలకు మరో పది రోజుల పాటు నీటిని సరఫరా చేయిస్తానని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం గుంతకందాల రైతులు ఎమ్మెల్యేను కలిసి నీటి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మద్రాసు కాలువ గేట్లను మూయించి పది రోజులు పాటు వన్ ఆర్ తూము ద్వారా నీటిని విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే శిల్పాకు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, మండల కార్యదర్శి కే.రామ్మోహన్ రెడ్డి, నందిరెడ్డిగారి రామిరెడ్డి, రైతులు సుధాకర్ నాయక్, శివన్న పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే శిల్పా పరామర్శ

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు రమణ ఇటీవల బైక్‌ప్రమాదంలో గాయపడ్డారు. మంగళవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే 6వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అహ్మద్‌రసూల్ అస్వస్థతకు గురికావడంతో పరామర్శించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజామోహన్‌రెడ్డి, విజయచౌదరి, జయకృష్ణ, వరాల మాలిక్, అంజాద్‌అలీ, రఫి, చాపల రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణమే లక్ష్యం

నంద్యాల(అర్బన్): ఉత్తమ సమాజ నిర్మాణమే ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక లక్ష్యమని ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఆకుమల్ల రహీం అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం పట్టణ ప్రధాన కార్యదర్శి శివశంకర్ అధ్యక్షతన నంద్యాల పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సౌజన్య, కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా నీలిమా తదితరులను ఎన్నుకున్నారు.

వంటావార్పుతో అంగన్‌వాడీల నిరసన



వెలుగోడులో వంటావార్పు చేపట్టిన అంగన్‌వాడీలు

ఆత్మకూరు: తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం కొనసాగాయి. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద యునియన్ నాయకురాలు మంజుల, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, సీఐటీయూ నాయకులు ఏసురత్నం, రణధీర్ ఆధ్వర్యంలో వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు.

వెలుగోడు: అంగన్‌వాడీల ఆందోళన మంగళవారం 8వ రోజు కొనసాగింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సీఐటీయూ మండల అధ్యక్షుడు వి. నాగమోహన్, భాగ్యలక్ష్మి, అనిత, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మె 8 వరోజుకు చేరుకుంది. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంట వార్పుచేసి అంగన్‌వాడీలు నిరసన తెలియజేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



ఆయుస్మాన్ కార్డు పంపిణీ చేస్తున్న దృశ్యం

మిడుతూరు: అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఓ పీరునాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో సర్పంచ్ ఉషా రాణి అధ్యక్షతన, పైపాలెం గ్రామంలో సర్పంచ్ రామచంద్రుడు అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కలిగిఉండటంతోపాటు, పథకాల లబ్ధితో అభివృద్ధి పథంలోకి రావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంపై, డ్రోన్ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీరుసాహెబ్‌పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగుతులసిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, మెడికల్ ఆఫీసర్ సురేష్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ వెంకటశివ, డీఎస్పీ

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఈఆర్‌ఓ వెంకటశివ, డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో, గ్రామాల్లో, పట్టణాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గ్రామాలు, సమస్యాత్మక రహదారులు ఎక్కడెక్కడ ఉన్నాయో ప్రత్యేకాధికారులు, పోలీస్ అధికారులు గుర్తించాలన్నారు. ప్రధానంగా పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, ఎలాంటి బందోబస్తు నిర్వహించాలో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మండలాల ప్రత్యేకాధికారులు, సీఐ, ఎస్సైలు సమస్యాత్మక గ్రామాలను, పోలింగ్ కేంద్రాలను సందర్శించి నివేదికను అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాదేవి, సీఐ సుబ్రహ్మణ్యం యాదవ్, ఎన్నికల డిప్యుటీ తహసీల్దార్ రవణమ్మ, ఎస్ఐలు పాల్గొన్నారు.

పీరుసాహెబ్ పేటలో చోరీ

మిడుతూరు: మండలపరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ జగన్‌మోహన్ గ్రామానికి చేరుకొని చోరీ జరిగిన ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఇంటి యజమానురాలు రెడ్డివారి గోపాలమ్మ ఇంటికి తాళం వేసి ఈ నెల 8వ తేదీ హైదరాబాదులోని తన కుమారుడి వద్దకు వెళ్లింది. తిరిగి మంగళవారం ఉదయం 11.30 గంటలకు గ్రామానికి చేరుకుంది. ఇంటి తలుపు స్క్రూలు తీసి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించింది. కర్నూలు నుంచి క్లూస్ టీం రప్పించి వేలిముద్రలు తీసుకోనున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

నంద్యాలకు చేరుకున్న శ్రీశైల మహాపాదయాత్ర

నంద్యాల(వ్యవసాయం): తాడిపత్రి శ్రీబుగ్గరామలింగేశ్వర దేవస్థానం నుంచి ప్రారంభమైన శివస్వాముల శ్రీశైల 16వ మహాపాదయాత్ర మంగళవారం నంద్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా నంద్యాలకు చెందిన శివస్వాములు వారికి స్వాగతం పలికారు. తాడిపత్రికి చెందిన గురుస్వామి చంద్రమోహన్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి తాడిపత్రి నుంచి శివస్వాములు పాదయాత్ర ద్వారా శ్రీశైలంకు చేరుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈనెల 16 నుంచి పాదయాత్ర ప్రారంభమైందని 23వ తేదీన శ్రీశైలం శ్రీమల్లికార్జున, శ్రీ భ్రమరాంబికా దేవిని దర్శించుకుంటామన్నారు. మహాపాదయాత్రలో దాదాపు 200మంది పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో 12 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శశికళ మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ...విజేతలకు ఈ నెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేయటం జరుగుతుందని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో రాజేశ్వరి, విజయలక్ష్మి, లక్ష్మీ చైతన్య వ్యాసరచన ఆంగ్ల భాగంలో సాయికృష్ణ, సదాఫ్, నూర్‌మహమ్మద్, వక్తృత్వ ఆంగ్ల విభాగంలో సాయికృష్ణ, సదాఫ్, జ్యోతిర్మయి, వక్తృత్వ తెలుగు విభాగంలో అలి మాబి, రాజు, రాజేశ్వరి బహుమతులు సాధించినట్లు వెల్లడించారు.

ద్విచక్రవాహనాలపై శబరిమలైకు

రుద్రవరం: స్థానిక భాస్కర నందీశ్వర స్వామి ఆలయం నుంచి అయ్యప్ప మాలాధారులు మంగళవారం ద్విచక్రవాహనాలపై శబరిమలైకు బయలుదేరారు. మాల ధరించి నియమ నిష్ఠలతో 41 రోజుల పాటు అయ్యప్ప దీక్ష ఆచరించారు. గడువు ముగియడంతో వారు ఇరుముడి ధరించి గ్రామ శివారు వరకు నడిచుకుంటూ వెళ్లి.. అక్కడి నుంచి ద్విచక్రవాహనాలపై శబరిమలైకి పయనమయ్యారు.

మొర ఆలకించండి!



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని ఎస్.సీ కాలనీ, సంజీవనగర్‌లో మురుగు సమస్యను పరిష్కరించాలని విన్నవించినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నెల రోజులు కావస్తున్నా మురుగు కాలువలలో చెత్త తొలగించకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని వాపోతున్నారు. మురుగునీటితో పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

వెలుగోడు: మండలంలోని గుంతకందాల గ్రామంలో ప్రకతి వ్యవసాయం చేసిన రైతులు లాభాలు గడించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్ మేకర్ రైతు సుబ్బరాయుడు ఎకరా విస్తీర్ణంలో వేసిన పంటలను మంగళవారం వెలుగు మండల సమాఖ్య సభ్యులు, సీసీలు, బుక్ కీపర్స్, ఏపీఎం పుల్లయ్య తదితరులు ఫీల్డ్ విజిట్ చేశారు. రైతు సుబ్బరాయుడు మాట్లాడుతూ.. తాను గత 5 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని, పెట్టుబడి ఖర్చులు బాగా తగ్గాయని, పంటల దిగుబడి కూడా బాగా వస్తుందని చెప్పారు. అలాగే మార్కెట్‌లో మంచి రేటుకు అమ్ముకుంటున్నానని తెలిపారు. నంద్యాల జిల్లా ఏపీసీఎన్ఎఫ్ ఏడీపీఎం అబ్దుల్ సలాం మహిళా సభ్యులు అందరికీ ప్రకృతి వ్యవసాయం గురించి, రసాయనాలు వాడకుండా పంటలు పండించే పద్ధతుల గురించి వివరించారు. ఎస్ఆర్‌పీ నరేంద్ర గౌడ్, ఏపీఎం పుల్లయ్య మాట్లాడుతూ మండల సమైఖ్య ఆధ్వర్యంలో ప్రతి మహిళా సభ్యురాలు పెరటి తోటల పెంచుకునేలా చూస్తామని తెలిపారు. ఎంటీ మహబూబ్ బాషా, ఎల్-2 నజీర్, నాగేంద్ర పాల్గొన్నారు.

క్రీడల్లో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నందికొట్కూరు: ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారని ప్రిన్సిపాల్ నాగ రవీంద్ర తెలిపారు. రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ చాటని పాములపాడు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల క్రీడాకారులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన అండర్-19 త్రో బాట్ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఆదర్శ పాఠశాల, కళాశాల క్రీడాకారులు కే.హేమంత్, బీ.అర్జున్ ప్రతిభ చాటి కర్నూలు జట్టు కప్ సాధించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. కే. హేమంత్ జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యాడని, బీ.అర్జున్ స్టాండ్ బైలో ఉన్నట్లు తెలిపారు. అంతే కాకుండా తమ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సాయికృష్ణ స్టేట్ లెవెల్ టీమ్‌కు కోచ్‌గా వెళ్లడం జరిగిందని తెలిపారు.

స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన



ఆర్జీఎం కాలేజీ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల భద్రతా రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పరిశీలించారు. మంగళవారం సాయంత్రం పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కాలేజీ, శాంతిరాం ఫార్మసీ అండ్ ఇంజినీరింగ్ కాలేజీలలోని భవనాలను జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిలతో కలిసి సందర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ పిదప ఈవీఎంలు భద్రపరిచేందుకు ఒక్కో నియోజకవర్గానికి అసెంబ్లీకి రెండు భవనాలు, పార్లమెంట్‌కు రెండు భవనాలు చొప్పున నాలుగు భవనాలు, ఆరు నియోజకవర్గాలకు 24 భవనాలు అవసరం అవుతాయని గుర్తించారు. వీటితో పాటు అన్ని నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను కూడా పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. డీఎస్పీ మహేశ్వర రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఆర్‌డీఓ శ్రీనివాసులు తదితరులు వారి వెంట ఉన్నారు.

విద్యుత్ పొదుపుతో పర్యావరణ పరిరక్షణ

నంద్యాల(అర్బన్): విద్యుత్‌ను పొదుపుగా వాడటం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని నంద్యాల విద్యుత్ శాఖ ఏఈ రామయ్య సూచించారు. జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు పట్టణంలో వెల్డింగ్ షాపులు, పరిశ్రమలు, తదితర ప్రాంతాల్లో పని చేస్తున్న వర్కర్లకు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ద్వారా భావి తరాలకు సమస్యలు లేకుండా చేయవచ్చన్నారు.

ఘనంగా క్యాండిల్‌లైట్ సర్వీస్



క్యాండిల్ లైట్ సర్వీసులో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-2(ఆల్ సెయింట్ చర్చి)లో మంగళవారం సాయంత్రం క్యాండిల్ లైట్ సర్వీసును పాస్టరేట్-2 డీనరీ చైర్మన్ రెవరెండ్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసు మార్గాన్ని అనుసరించాలన్నారు. అనంతరం ప్రపంచ శాంతి కొరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు ఈ లోకానికి వెలుగైయున్నాడని క్రైస్తవుల విశ్వాసం అన్నారు. అందులో భాగంగానే చర్చిలో క్యాండిల్ లైట్ సర్వీస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం క్వయర్ బృందం ఆలపించిన ప్రత్యేక భక్తి గీతాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో రెవరెండ్ విజయ్‌కుమార్, జోయెల్, సెక్రటరీ కిరణ్‌కుమార్, ట్రెజరర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో..

నంద్యాల పట్టణంలోని ఎంఎస్ నగర్‌లో క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం క్యాండిల్ లైట్ సర్వీసును పీటర్ పాల్ అధ్యక్షతన నిర్వహించారు. క్రిస్టియన్ జేఏసీ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మన్నెం జానయ్య, రిటైర్డు తహసీల్దార్ జేమ్స్, రిటైర్డు ఎస్ఐ సామేలు, ఆనందనం ఏసన్నలు పాల్గొని దైవ సందేశం వినిపించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పుల్లా నరసింహులు పాల్గొన్నారు.